RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 33 ఆదివారం 20 ఏప్రిల్ 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## 22న ఇంటర్ ఫలితాలు



*జనం వెలుగు, హైదరాబాద్, ఏప్రిల్ 19:–* తెలంగాణలో ఇంటర్ వార్షికల పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 22న ప్రకటించనున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఏబీపీ దేశం వెబ్‌సైట్‌లోనూ ఫలితాలను చూసుకోవచ్చు. రాష్ట్రంలో మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహించగా... పరీక్షలు పూర్తయిన నెలరోజుల్లోపే ఫలితాలను వెల్లడించనుండటం విశేషం. ఏపీలో ఇంటర్ ఫలితాలను ఏప్రిల్ 12న వెల్లడించిన సంగతి తెలిసిందే. తెలంగాణలో ఇంటర్ ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ఇంటర్మీడియట్ బోర్డు జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా జవాబుపత్రాల మూల్యాంకనంలో ఈసారి ముందస్తు పునఃపరిశీలన చేసింది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన తర్వాత మార్కులు సరిగా రాలేదని, లెక్చరర్లు చేసిన తప్పిదం వల్లే తాము ఫెయిల్ అయ్యామని విద్యార్థులు ఆరోపిస్తుంటారు. ఈ నేపథ్యంలో 35 మార్కులు రాని విద్యార్థులకు సంబంధించి జవాబుపత్రాలను చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు నిపుణులతో క్షుణ్నంగా పునఃపరిశీలన చేయించనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఉంటుందని వారంటున్నారు. ఏప్రిల్ 10 నాటికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికాగా.. ఫలితాలను ఏప్రిల్ 22న వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ కలిపి మొత్తం 9 లక్షల 96వేల 971 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరందరి అన్ని సబ్జెక్టులు కలిపి సుమారు 60 లక్షల సమాధాన పత్రాలను మూల్యాంకనం పూర్తిచేసిన ఇంటర్ బోర్డు.. ఫలితాల వెల్లడికి సిద్ధమవుతోంది. వేసవి సెలవుల తర్వాత జూన్ 2 నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో ఈసారి కూడా పాతవిధానంలోనే ఇంటర్ ప్రవేశాలు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలకు వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని విద్యాశాఖ భావించిన సంగతి తెలిసిందే. అయితే ఆన్‌లైన్ విధానం అమలు చేయాలంటే ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు గ్రేడింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒక్కో కళాశాలకు ఫీజు నిర్ణయించాల్సి ఉంటుంది. ఆ దిశగా ఇప్పటివరకు ఎలాంటి కసరత్తు జరగలేదు. దీంతో అది కష్టమని ఇంటర్‌బోర్డు నిర్ణయానికి వచ్చింది. ఒకవేళ ప్రభుత్వం ఫీజులు నిర్ణయించినా తాము జేఈఈ, ఎప్‌సెట్, నీట్ తదితర పోటీపరీక్షలకు కూడా శిక్షణ ఇస్తామని, హాస్టళ్లు ఉన్నాయని, ఫీజులను ఎలా నిర్ణయించారంటూ కళాశాలలు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఇంటర్‌బోర్డు.. వచ్చే విద్యా సంవత్సరానికి పాత విధానమే కొనసాగించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ధ్రువీకతెలంగాణలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు ఇంటర్ బోర్డు ఏప్రిల్ 3న నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. మే 4 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆలస్య రుసుంతో జూన్ 8 వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటును బోర్డు కల్పించింది.

## 10 శాతం భూములను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత స్థానికులదే
### ఆర్మూర్ ఎంఎల్ఏ పైడి రాకేష్ రెడ్డి



**జనం వెలుగు, ఆర్మూర్:–** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ప్లాటింగ్ లలో రియాల్టరులు వదిలిన 10 శాతం భూములను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆయా కాలనీ వాసులదేనని ఆర్మూర్ ఎంఎల్ఏ పైడి రాకేష్ రెడ్డి అన్నాడు. ఆర్మూర్ మున్సిపల్ లలో వివిధ వార్డులలో శనివారం అధికారులతో ఆయన పర్యటించడం జరిగింది. మామిడి పల్లిలో గల ప్రభుత్వ భూమిని గుర్తించి వెంటనే హద్దు రాళ్ళను పాతి పార్కుగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించాడు. వివిధ వార్డులలో జాయింట్ కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమీషనర్ రాజులతో కలిసి పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నాడు. రోడ్లపై మురుగు నీరు పారకుండా జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించాడు. ఇటీవల కేటాయించిన నిధులను సమస్యలు ఎక్కువగా ఉన్న వార్డులలో ఉపయోగించాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమృత్ 2.0 మంచి నీటి పథకం నీళ్ళ ట్యాంక్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశాడు. గతంలో పెర్కిటు చెరు వులో ఏర్పాటు చేసిన కరెంట్ స్థంభాలను దొంగలు దొంగలించుకు పోవడంపై అధికారులు తగు చర్యలు తీసుకోలేక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మున్సిపల్ మాజి చైర్మన్ కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశానికి చేరిన రెండు మృతదేహాలు



**జనం వెలుగు, బాల్కొండ:–** దుబాయిలో ఇటీవల హత్యకు గురైన రెండు మృతదేహాలు శనివారం హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకోవడం జరిగింది. తెలంగాణాలోని నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ మృత దేహాలను టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ రెండు మృతుల కుటుంబాలకు అండగా ఉన్నామని భరోసా ఇవ్వడం జరిగింది. గల్ఫ్ అడ్వైజరీ కమిటి చైర్మన్ వినోద్ కుమార్, మంద భీం రెడ్డిలతో కలిసి టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ భౌతికాయాలకు నివాళులు అర్పించారు. బతుకు దెరువు కోసం తెలంగాణ ప్రాంతం నుండి గల్ఫ్ దేశానికి ఉపాధి కోసం నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుండి వలస పోతుంటారని టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నాడు. రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో ఉన్నాడని రెండు కుటుంబాలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం,తెలిపాడని, ఆ కుటుంబాలను అన్నివిధాలుగా ప్రభుత్వం తరపున ఆదుకుంటామని సిఎం తెలిపాడని గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల చెక్కును అందిస్తామని ఆయన వివరించాడు.

# గల్ఫ్ బాధితులను మోసం చేసిన ముఠా అరెస్ట్

### పోలీస్ కమీషనర్ సాయి చైతన్య

*జనం వెలుగు, నిజామాబాద్:–* నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతను టార్గెట్ చేసి దుబాయ్ వంటి గల్ఫ్ దేశాల్లో ఉన్నత ఉద్యోగాలు అందిస్తామంటూ నమ్మబలికి, ఒక్కొక్కరిలో నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన ముఠా గుట్టురట్టు చేశారు నిజామాబాద్ పోలీసులు. నిజామాబాద్‌కు చెందిన దోందిగల్ భూమేష్ రెడ్డి, అతని భార్య స్వప్న, నందిపేటకు చెందిన అరుగుల భోజరాం, నిజామాబాద్‌లో శ్రీదేవి ట్రావెల్స్‌కి చెందిన బిజ్జం సుబ్బారెడ్డి, ఆర్మూర్‌లో ట్రావెల్ ఏజెన్సీ నిర్వహించే ఆరెపల్లి మహేష్, అలాగే మోచ రాజు కలిసి ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి నట్లు జిల్లా పోలీసు కమీషనర్ సాయి చైతన్య తెలిపాడు. నందిపేట పోలీస్ స్టేషన్ లో ఈ నెల 5 న, డొంకేశ్వర్ మండలానికి చెందిన బాధితుడు నందిపేట పోలీసు స్టేషన్ లో ఇచ్చిన దరఖాస్తు మేరకు నిజామాబాద్ సిపి పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు నందిపేట్ పిఎస్ క్రైమ్ నెంబర్:85/2025 అండర్ సెక్షన్, చీటింగ్ ఇమిగ్రేషన్ యాక్ట్ కింద, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపాడు. పైన పేర్కొన్న విదేశాలకు పంపే నకిలీ ఏజెంట్లు ఒక కూటమిగా ఏర్పడి అమాయకపు నిరుద్యోగ యువతకు దుబాయిలో మంచి కంపెనీలో ఉద్యోగాలను ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేస్తారని ఆయన తెలిపాడు. మూడు కంపెనీలలో జనరల్ మేనేజర్ గా, ఫైనాన్స్ మేనేజర్లమంటూ చెప్పుకుంటూ వారికి వీసాలు పంపించి ఒక్కొక్కరి వద్ద సుమారు 6 లక్షల రూపాయలు తీసుకొని దుబాయిలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగాలంటు, హై ప్రొఫైల్ క్రియేట్ చేసి వారి పేర్లు మీద క్రెడిట్ కార్డ్స్, పర్సనల్ లోన్స్ తీసుకొని సుమారు ఆరు నెలల తర్వాత, బాధితులకి 30 లక్షల రూపాయలు ఇచ్చి తిరిగి ఇండియాకి పంపిస్తామని మాయమాటలు చెప్పి దుబాయి వెళ్లిన తర్వాత వారికి ఎలాంటి




ప్రైవేటు ఉద్యోగం చూపించకుండా 6 నెలల తరువాత వారిని బెదిరించి దుబాయి నుండి తిరిగి ఇండియాకి వాళ్ళని పంపించేసారని ఆయన తెలిపాడు. ఈ ముఠా సభ్యులు అంతా కలిసి సుమారు 70 నుంచి 80 మంది నిరుద్యోగ యువకులను మోసం చేశారని తెలిసిందని, ఇట్టి కేసును నిజామాబాద్ సిపి పి సాయి చైతన్య ఆదేశానుసారం సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి పర్యవేక్షణలో నందిపేట ఎస్సై ఎమ్. చిరంజీవి, పోలీసు సిబ్బంది ఈనెల 12 న, అరుగుల బోజారం (ఏ3) ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించగా, ఈ నెల 19/ న మరో ఇద్దరు ముద్దాయిలైన పబ్బ స్వప్న @ దుండిగల్ స్వప్న (ఏ2), బిజం సుబ్బారెడ్డి, (ఏ5) (శ్రీదేవి ట్రావెల్ ఏజెన్సీ, నిజామాబాదు) లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఆయన తెలిపాడు. ఇకపోతే పబ్బ స్వప్నపై గతంలో జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్లో గల్ఫ్ చీటింగ్ కేసు ఉందని ఆయన అన్నాడు. ఏ1, ఏ4, ఏ6 లను పట్టుకోవడానికి పోలీసులు గాలిస్తున్నారని ఆయన తెలిపాడు. ముఖ్యంగా యువకులు ఎవరు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే న్యాయ సహాయం కోసం ఆయా పోలీస్ వారిని సంప్రదించాలని ఆయన వివరించాడు.

## ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందా
### సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



**జనం వెలుగు, టోక్యో ఏప్రిల్ 19:–** జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సిన ప్రగతి సాధించామని అన్నారు. రాష్ట్రంలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్‌ని పరిశీలించామని అన్న రేవంత్ మూసీ ప్రక్షాళనకు కొంతమంది అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని సిఎం పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు పెరగాలి అని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. 'తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని అన్నారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు' అని జపాన్‌లో స్థిరపడ్డ తెలుగువారిని ఉద్దేశించి సిఎం ప్రసంగించారు.